లేనట్లుగా అతను కూడా తన లాల్చీ జేబులోంచి ఒక మంగళసూత్రం తీసి 'ముందు ఇది చూడండి!' అంటూ చమన్‌లాల్ చేతిలో పెట్టాడు. ఆమె పొట్లం విప్పేసరికి చమన్‌లాల్ అతనిచ్చిన మంగళసూత్రం పరీక్షించడం పూర్తిచేసి త్రాసులో వేశాడు. అతను ఆమె విప్పుతున్న పొట్లంవైపు చూసి ఉలికి పడ్డాడు. అది కూడా మంగళసూత్రమే! "తాకట్టా? అమ్మేస్తారా?" అన్నాడు చమన్‌లాల్, ఆమె చేతిలోని వస్తువు చూస్తూ. "అమ్మేస్తానండీ" అందామె కొద్దిగా వణికే గొంతుతో. "మీ సంగతి కాదమ్మా! ఆయనను అడుగుతున్నాను" అన్నాడు చమన్‌లాల్. "నన్నేనా అడిగేది?—అమ్మకానికేలెండి. త్వరగా కానీయండి" అన్నాడతను. "ఉండండి మరి! తొందరైతే ఎలాగ? ఏదమ్మా, మీ వస్తువు ఇలా యియ్యండి" అంటూ ఆమె చేతిలోని వస్తువును అందుకున్నాడు. "కాస్త వేగం దబ్బివ్వండి. చాలా అర్జెంటు" అందామె—బాధగా. ఆమె పెళ్ళయి సంవత్సర కాలేదింకా! ఇంతలో ఆమె భర్తకి టి. బి. అని తెల్సింది. దొరికినంతవరకూ అప్పులు చేసి వైద్యం చేయించింది. ఇంక మరి అప్పు దొరకని సమయంలో, తగ్గు ముఖం పట్టిన వ్యాధిని నిర్లక్ష్యం చేయలేక ఆమె తన మాంగల్యాన్ని అమ్మడానికి సిద్ధపడింది.

అతని పేరు శంకరం! అతడొక పక్కా త్రాగుబోతు. మొదట్లో మామూలుగానే, సరదాకి. కొద్ది కొద్దిగా త్రాగేవాడు. రానురాను వ్యసనం ముదిరి పక్కా త్రాగుబోతుగా మారాడు. అతని భార్యకి చాలా నగలుండేవి. అవన్నీ అతని వ్యసనానికి హరించుకుపోయాయి. చివరికి ఆమె మెడలో మాంగల్యం మాత్రం మిగిలింది. అదివ్వననీ, ఇవ్వలేనని ఆమె ఏడ్చింది. భర్తగా తనకున్న హక్కు పురస్కరించుకుని, ఆమెని చావగొట్టి, అది బలవంతంగా లాక్కుని మరీ తెచ్చాడతను.

అంతలోనే కొద్దిగా నలిగిన బెరికాట్ పాంటూ, బెరికాట్ షర్టూ, ఉంగరాల జుత్తూ, కాస్త నీరసంగా వున్న మొహంతో మెట్లెక్కి వస్తున్న ఒక యువకుని చూసి సంతోష పూర్వకంగా ఆహ్వానించాడు సేట్‌జీ! పాంటు జేబులోంచి ఏదో తీసి సేట్‌మీదకి గిరాటేస్తూ "అర్జెంట్! క్విక్!" అన్నాడు ముక్తసరిగా అతను. సేట్ దాన్ని ఒడుపుగా అందుకున్నాడు. అదొక మంగళసూత్రం! అతనిపేరు రాజు. అతడి వేషం పురానాగా వున్నా, అతడు భోజనం చేసి నాలుగు రోజులైంది. అతని వృత్తి పిక్‌పాకెటింగ్! దొరికితే కటకటాల వెనుక! దొరకనన్నాళ్ళు, పేరుకుతగ్గట్టే రాజా జీవితం! అతనిప్పుడే ట్రైన్ దిగి వస్తున్నాడు. ట్రైన్‌లో కొట్టేసిన వస్తువది! దాన్ని కూడా పరీక్షించడం పూర్తిచేసి, త్రాసులో వేశాడు సేట్‌జీ! కాస్త ముందు వెనుకల్లో వచ్చిన ముగ్గురికీ ఒకేసారి డబ్బిచ్చి పంపేశాడు. మరోసారి దేవుడికి నమస్కారం చేసి మూడు మంగళసూత్రాలనూ ఒకేసారి పొరుగులోకి పడేశాడు అతను. ఏ పరిస్థితుల్లో అవి అక్కడికి చేరినా, సేట్‌జీ దృష్టిలో వాటి విలువ ఒకటే!

—విశాఖ

తిరుగులేని ఋజువు

హెడ్‌క్వార్టర్స్ వదలి ఎక్కడికీ వెళ్ళకూడదనే షరతుమీద సార్జంట్ సుబ్బారావుకి వారంరోజులు సెలవు దొరికింది. అదే మహాభాగ్యమని పక్క ఊరిలో వున్న భార్యను ఆ వారంరోజులు తనతో గడపవలసిందిగా ఆహ్వానిస్తూ ఉత్తరం రాసేశాడు. లగేజ్ వీలయినంత తక్కువగా వుండాలని మరీమరీ రాశాడు.

భర్త చెప్పినట్లే చిన్న సూట్‌కేస్‌లో తన బట్టలు, టాయిలెట్ సామగ్రి మాత్రం తీసుకుని బయలుదేరింది సూర్యకాంతం. స్టేషను కెళ్ళి ఆమెను రిసీవ్ చేసుకుని దగ్గర్లోనే వున్న హోటల్ కెళ్ళాడు సుబ్బారావు.

అయితే ఆ ఊళ్ళో హోటల్ మేనేజర్లమీద ఒక ఆంక్షవుంది. అదేమంటే 'గది కావాలని వచ్చే మిలిటరీ వ్యక్తుల వెంట ఎవరైనా ఆడవాళ్ళుంటే వాళ్ళిద్దరూ దంపతులని ఋజువైతే గానీ వాళ్ళకు గదులు యివ్వకూడదు' అని.

గదిఒకటి కావాలని సుబ్బారావు అడిగిన వెంటనే "మీరిద్దరూ భార్యా భర్తల్లాగ అనిపించడం లేదు. అందువలన గది మీకివ్వడానికి వీల్లేద"న్నాడు ఆ హోటల్ మేనేజరు.

ఆ మాట వినేటప్పటికి సూర్యకాంతంకు అరికాలి మంట నెత్తికెక్కినట్టయింది. వెంటనే రౌద్రాకారం దాల్చి భర్త వైపు తిరిగి "చూశారా! మీ తెలివితేటలు యిలా యేడుస్తాయి. పైగా సామాన్లేవీ తీసుకు రావద్దని రాయడమొకటి. సిగ్గులేదూ మీ ముఖానికి? ఇలాంటివన్నీ ఆలోచించకుండా ఎంత చవట మొగుడైనా యిలా రాస్తాడా? ఇంకా అలా వాజమ్మలా నిలబడక—పదండి స్టేషనుకి...." అంటూ భారతం విప్ప బోతుండగా వెంటనే హోటలు మేనేజరు ఆమెను ఆపి "అమ్మా! ఈమాత్రం ఋజువు చాలు! ఇందండి గది తాళాలు" అంటూ తాళాలందించాడు!

—బి. గౌరి

మనిషిలో మనిషి

ఆరు పోర్షన్లు వున్న ఆ పూరింట్లోని చివరి పోర్షనులో దిగారు సుబ్బారావూ సుశీలా నవ దంపతులు.

పులి బోనులోకి అడుగు పెట్టిన మేకపిల్లను చూసినట్లు జాలిగా చూశారు సుశీలవైపు అక్కడున్న వాళ్ళంతా.

పసితనం వీడని పదహారేళ్ళ ముగ్ధ. నిర్మలమైన చూపులు. ముద్ద బంతిలాంటి సుశీల పులివాత పడవలసిందే! రామచిలుక మానభంగం తమ కళ్ళముందు జరగవలసిందే! బాధగా విట్టూర్చారు ఎవరికి వారు.

నాలుగో వాటాలోవున్న వీర్రాజు ఆ పులి. తల్లితప్ప మరో తోడులేదు. మెలితిరిగిన మీసాలతో నల్లగా అచ్చోసిన ఆంబోతులా వుంటాడు. ఆ ఇంట్లోనే కాదు ఆ పేటకే హడల్ వీర్రాజంటే. వయసు వచ్చిన ఆడపిల్లలున్న వాళ్ళెవరూ ఆ యింట్లో దిగరు. తెలియక దిగారో కొద్ది రోజుల్లోనే ఆ పిల్ల మీద అత్యాచారం జరగక మానదు.